ప్రజాశక్తి

మంగళవారం 7 మార్చి 2023 5 అనంతపురం

టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న నిరసనకు దిగుతున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

వలసెళ్లుతున్న ఊళ్లు..!

పనుల కోసం బెంగుళూరుకు వెళ్లేందుకు బళ్లారి రైల్వే స్టేషన్‌లో ఉన్న కూలీలు

రోజూ పని చేస్తే తప్పా పూటగడవని కూలీలు పనులు లేక వలసబాట పడుతున్నారు. ఉన్న గ్రామంలో కనీసం రోజుకు రూ.200 కూలి వచ్చే పనులు లేక కుటుంబ పోషణ నిమిత్తం నిత్యం వందలాది మంది కూలీలు నగరాలకు పయనం అవుతున్నారు. ఆసరాగా ఉండాల్సిన ఉపాధి హామీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. ఉపాధి పనిదినాలు పూర్తి స్థాయిలో ఉంటే వలసెళ్లాల్సిన పని లేదంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని తరచూ అధికారుల సమీక్షల్లో విన్పించే మాటలు ఆచరణలో కన్పించడం లేదు.

- ‘ఉపాధి’ లేక అవస్థలు
- పనుల కోసం నగరాలకు పయనం
- కుటుంబ పోషణకు తప్పదంటున్న కూలీలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలం కర్నాటక సరిహద్దున ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వీరంతా వ్యవసాయంతో పాటు ఉపాధి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సాగు ముగియడంతో వ్యవసాయ పనులు తగ్గాయి. ఇలాంటి సమయంలో ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా దాని ఊసే లేకుండా పోయింది. దీంతో బొమ్మనహాల్ మండలం నుంచి నిత్యం కూలీలు బెంగుళూరుకు వలస వెళ్తున్నారు. మండల పరిధిలోని ఉంతకల్, కొలగానల్లి, గోనేహాళ్, శ్రీధరఘట్ట, బొల్లనగుడ్డం, కొత్తూరు, కానాపురం తదితర గ్రామాలకు చెందిన కూలీలు కుటుంబ పోషణ నిమిత్తం పొట్టచేతబట్టుకుని బెంగుళూరుకు వలస వెళ్తున్నారు. బళ్లారి రైల్వే స్టేషన్ మీదుగా ఇలా ప్రతి రోజూ పదుల సంఖ్యలో కుటుంబాలు బెంగుళూరుకు వలస పోతున్నారు. బళ్లారి రైల్వే స్టేషన్‌లో చూస్తే మండలం, పరిసర మండలాల నుంచి వలసెళ్లే కూలీలు అనేక మంది కన్పిస్తారు. ఆయా గ్రామాల్లో గత రెండు నెలల నుంచి ఉపాధి పనులు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒక్కొక్కరికి రోజు కూలి రూ.250 పడాలని నిబంధన ఉన్నా, రూ.100కు మించి కూలి రాని పరిస్థితి ఉంది. ఈ తక్కువ మొత్తం కూడా ఎప్పుడు ఖాతాల్లో పడుతుందో తెలియదు. దీనికి తోడు గత నెల రోజులుగా పనులు కల్పించడంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతోంది.

పని ప్రదేశంలో వసతులూ శూన్యం

ఉపాధి హామీ పనులు చేస్తున్న చోట అధికారులు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. వేసవిలో తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఇలాంటివేవీ అమలు కావడం లేదు. కూలీలకు పనిముట్లు కూడా ఇవ్వడం లేదు. గడ్డపారలు, గంపలను కూలీలు బయట అద్దెకు తెచ్చుకుంటున్నారు. గడ్డపారలు ఒక్కసారి పదును పెట్టేందుకు రూ.100 తీసుకుంటున్నారు. ఉపాధిలో వస్తున్న కూలి ఈ పనిముట్ల మరమ్మతులు, బాడుగలకే పరిపోతున్నాయంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధిపై నమ్మకం లేక కూలీలు వలసెళ్తున్నారు.

స్థానికంగా ఉపాధి లేకనే...

ఖరీఫ్, రబీ సీజన్ ముగియడంతో స్థానికంగా ఉపాధి పనులు తగ్గాయి. ఇలాంటి సమయంలో ఉపాధి పనులు విరివిగా కల్పిస్తే ఉపయోగంగా ఉంటుంది. అలా ఉపాధి పనులను కల్పించడం లేదు. ఉపాధి పనులు చేసినా కూలి గిట్టుబాటు కావడం కాలేదు. రోజుకు రూ.150కు మించి కూలి పడడం లేదు. దీంతో చేసేది లేక కుటుంబంతో సహా పనుల కోసం బెంగుళూరుకు వలస వెళ్తున్నాం.

హరిజన సుంకన్న,
గోనేహాల్ గ్రామం.

కుటుంబ పోషణ నిమిత్తం...

రోజు పనులు చేసుకుంటేనే జీవనం గడుస్తాది. ప్రస్తుతం గ్రామంలో పనులు లేవు. ఉపాధి పనులూ అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారం అయ్యింది. చేసేది లేక బెంగుళూరుకు వెళ్తున్నాం. సొంత గ్రామంలో పనులు కల్పిస్తే ఈపరిస్థితి ఉండదు. అధికారులు స్పందించి విరివిగా ఉపాధి పనులు కల్పించి, గిట్టుబాటు కూలిని ఇవ్వాలి.

హనుమంతు
ఉంతకల్లు, గ్రామం.

అనంతలో హై టెన్షన్

- రాళ్లు రువ్వుకున్న టిడిపి, వైసిపి వర్గీయులు
- గుంటూరు నుంచి అనంతకు చేరిన సోషల్ మీడియా వార్
- ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అరెస్ట్

నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వ్యక్తిగత విమర్శలతో వైసిపి, టిడిపి నేతల పరస్పర దాడులతో అనంతపురం జిల్లా కేంద్రం హై టెన్షన్‌గా మారింది. సోషల్ మీడియా వేదికగా మొదలైన ఘర్షణ ఒకరిపై ఒకరు రాళ్లురువ్వుకుంటూ భౌతిక దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. సోమవారం ఉదయం టవర్‌క్లాక్ వద్ద చోటు చేసుకున్న ఈ దాడుల ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ దాడుల్లో ఓ కానిస్టేబుల్, టిడిపి కార్యకర్తకు గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర, ఆయన తనయుడు, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్‌ను విమర్శిస్తూ గుంటూరుకు చెందిన వైసిపి సోషల్ మీడియా కార్యకర్త హరికృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం ఓ పోస్టును ఫేస్‌బుక్‌లో పెట్టారు. దీనికి ప్రతిగా టిడిపి కార్యకర్తలు సైతం హరికృష్ణారెడ్డిని విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. పరిటాల కుటుంబం అవినీతి, హత్యా రాజకీయాలను రాప్తాడు, అనంతపురంలోనే వివరిస్తానంటూ హరికృష్ణారెడ్డి మరో పోస్టు పెట్టారు. సోమవారం ఉదయం తాను అనంతపురం వస్తానని కూడా ఆ వీడియో సందేశంలో అతను తెలిపారు. ఈ మేరకు అతను సోమవారం ఉదయం రాప్తాడు నియోజకవర్గం కేంద్రానికి వెళ్లి తాను టిడిపి కార్యాలయం వద్ద ఉన్నానని తనతో మాట్లాడే వారు ఎవరైనా ఉంటే రావొచ్చని సోషల్ మీడియా ద్వారా సవాల్ విసిరారు. అనంతరం అక్కడి నుంచి వైసిపి మద్దతు దారులతో కలిసి అనంతపురం టవర్‌క్లాక్ వద్దకు వెళ్లాడు. హరికృష్ణారెడ్డి టవర్‌క్లాక్ వద్దకు వెళ్తున్నాడని తెలుసుకున్న టిడిపి మద్దతుదారులు, పరిటాల అభిమానులు అక్కడికి చేరుకున్నారు. టిడిపి, వైసిపి నాయకులు ఎదురెదురుపడడంతో ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్, టిడిపి కాకర్యకర్తకు రాళ్లు తగిలి తలకు బలమైన గాయాలు అయ్యాయి. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గుంటూరు నుంచి వచ్చిన హరికృష్ణారెడ్డిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇతనితో పాటు టిడిపి మద్దతుదారులనూ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసరంగా కవ్వింపు చర్యలకు పాల్పడిన వైసిపి నాయకులను వదలి అక్రమంగా టిడిపి నేతలను అరెస్టు చేసి, బెదిరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఉద్రిక్తలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తామని డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

డిఐజి రవిప్రకాష్

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డిఐజి రవిప్రకాష్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిఐజి రవిప్రకాష్ పోలీసు సిబ్బందికి సూచించారు. పోలీసుల ఆకస్మిక తనిఖీలో భాగంగా బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై మాట్లాడారు. కేసులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. లాకప్ గదిలో అనవసరంగా ఎవర్నీ ఉంచరాదన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలి. ఈ స్టేషన్ పరిధిలో ఏటా సుమారు 400 దాకా నేరాలు జరుగుతున్నాయని, ఇందులో అధికంగా భూతగాదాల వల్ల తలెత్తే హర్ట్ కేసులు, ఆత్మహత్యల కేసులు ఉన్నాయన్నారు. వీటి నియంత్రణపై దష్టి సారించాలని సూచించారు. ఆత్మహత్యల అనర్థాలపై ప్రజల్లో అవగాహన తీసుకు రావాలన్నారు. విధి నిర్వహణలో నిజాయితీతో పని చేయాలని సూచించారు. మహిళా పోలీసుల సహకారంతో సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిఐ అస్రార్ బాషా ఉన్నారు.

అన్ని వసతులతో పోలింగ్ కేంద్రాలు

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-పుట్లూరు, శింగనమల

మండలి ఎన్నికలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, సింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రంలో వసతులు, పోలింగ్ నిర్వహణపై అక్కడి అధికారులకు తగు సూచనలు చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సరైన వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ నాడు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎలాంటి చిన్న పొరబాటు లేకుండా ఎన్నికలను నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల నిర్వహణప అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-గార్లదిన్నె

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిందేనని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. భూస్వాములకు కొమ్ము కాస్తూ.. పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ అధికారులు ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని స్థానిక బస్టాండ్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను రాజకీయ నాయకులు, కొంతమంది ఉన్నతాధికారులు ఆక్రమించుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. పేదలు ఇంటి స్థలం కోసం సెంటున్నర భూమిని ఆక్రమించుకుంటే వాటిని తొలగిస్తున్నారన్నారు. కల్లూరు అగ్రహారం 259 సర్వే నెంబర్ భూమిలో పేదలు నిర్మించుకున్న గుడిసెలను రాత్రికి రాత్రే తొలగించడం దారుణం అన్నారు. వెంటనే ఈ భూమిని పేదల కేటాయించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కేంద్రంలో కూడా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాముడు, నాగమ్మ, పేద ప్రజలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

మహిళలు నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తారు..

జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

మహిళలు వారికి అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో నిర్వర్తించి విజయవంతం చేస్తారని అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. సోమవారం స్థానిక జేఎన్టీయూ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ ఆచార్య భువన విజయ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఈ నెల ఆరు నుండి 8వ తేది వరకు “షీ లెక్చర్ సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ప్రారంభ కార్యక్రమాన్ని ఆచార్య భువన విజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ మహిళలు అనేక రంగాలలో పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు వారికి కేటాయించిన ఏ పనినైనా సక్రమంగా నిబద్ధతతో నిర్వహిస్తారని తెలిపారు. అలాగే యూనివర్సిటీ లో 50 శాతానికి పైగా మహిళా డైరెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థినులు కూడా గొప్ప పదవులను నిర్వర్తిస్తున్నారని, ప్రస్తుత విద్యార్థినులు కూడా వారి ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఆచార్య సి. శశిధర్ మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపారు. మహిళలు రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు కూడా చదువులో రాణిస్తున్నారని తెలిపారు. గౌరవ అతిథి ఆచార్య జి. శ్రీలక్ష్మి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. నేటి భారతీయ మహిళలు విద్య, రాజకీయాలు, మీడియా, కళలు, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బందికి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఆచార్య వి.సుమలత, ఆచార్య ఆర్.కిరణ్మయి, ఆచార్య పద్మ సువర్ణ, ఆచార్య ఇ.కేశవరెడ్డి, ఆచార్య జివి.సుబ్బారెడ్డి, ఆచార్య ఎ.సురేష్‌బాబు, ఆచార్య బి.దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సుజాత, వివిధ విభాగాదిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

షీ లెక్చర్ సిరీస్ కార్యక్రమంలో జెఎన్‌టియు మహిళా ఆచార్యులు

పొట్టిపాడుకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ఉరవకొండ : ఉరవకొండ డిపో నుంచి పొట్టిపాడు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ విద్యార్థి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ కోరారు. సోమవారం గ్రామ ప్రజలతో కలిసి ఉరవకొండ డిపో మేనేజర్ బాలాజీ దయాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టిపాడు గ్రామం నుంచి చిన్న హోతూరులో ఉన్న పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదవతరగతి విద్యార్థులకు పరీక్షల సమయం 30 రోజులు మాత్రమే ఉందన్నారు. ఈ సమయంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై బాగా చదవలేక పోతున్నారని పేర్కొన్నారు. పొట్టిపాడు గ్రామం నుంచి చికిత్సల కోసం ఆస్పత్రికి వెళ్లడానికి కూడా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీలైనంత తొందరలో ఉరవకొండ డిపో నుంచి పొట్టిపాడు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు మధు ప్రసాద్, శ్రీసాయి కోచింగ్ సెంటర్ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్‌కు జెఎన్‌టియు విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ విద్యార్థులు ఉన్నత విద్యామండలి చాంపియన్ షిప్-2023 క్వాటర్ ఫైనల్‌కు చేరిన సందర్భంగా జేఎన్టీయూలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి చాంపియన్ షిప్-2023 గతనెల 28వ తేది ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్రంలోని అనంతపురం జేఎన్టీయూతో పాటు యోగి వేమన యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులు హాజరయ్యారు. ప్రతి రీజన్ నుండి 40 జట్లను ఇందుకు ఎంపిక చేశారు. యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంతం నుండి ఎంపిక చేసిన జట్లకు యోగివేమన విశ్వవిద్యాలయం కడపలో ఈనెల 3, 4 తేదీలలో ప్రిలిమినరీ క్వాలిఫైర్స్‌కు క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. ఈ పోటీలలో అనంతపురం జేఎన్టీయూ విద్యార్థులు మాధవ నరహరి, పి.మోహన్ దినేష్ క్వాటర్ ఫైనల్స్‌కు వచ్చారని వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ ఆచార్య పి.సుజాత విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

చేపల క్రయవిక్రయాలపై అవగాహన

ఉరవకొండ : చేపల వినియోగ క్రయవిక్రయాల అవగాహన సదస్సును ఉరవకొండ మండల కేంద్రంలోని వైకెపి కార్యాలయంలో ఏపీఎం శివయ్య, విలేజ్ ఫిషరీస్ అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఫేస్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేపల వినియోగ, క్రయ విక్రాయాలపై సీసీలు, యానిమేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపల విక్రయాదారులను గుర్తించడానికి వైకెపి అధికారులకు ప్రభుత్వం బాధ్యతను అప్పగించిందన్నారు. రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచడానికి గ్రామీణ ప్రాంతాల్లో చేపల వ్యాపారాల చిన్న దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. చేపల దుకాణాలకు సంబంధించి ప్రభుత్వం యూనిట్ కాస్ట్ రూ.లక్ష నిర్ణయించిందన్నారు. ఈ దుకాణాలు ఏర్పాటు చేయాలనుకున్నవారు యూనిట్ కాస్టులో 10 శాతంతో వారి పరిధిలోని సహకార బ్యాంకులో వారి పేరుమీద ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో వ్యాపారానికి సంబంధించిన వస్తు సామగ్రిపై రైతులకు ఇస్తారన్నారు. సబ్సిడీ పోగా మిగిలిన మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్ర

ఉగాది ఉత్సవాలపై సమీక్ష

గుంతకల్లు రూరల్ : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజులపాటు జరిగే ఉగాది ఉత్సవాలపై స్థానిక రామదూత నిలయంలో ఆర్డీవో రవీంద్ర అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భక్తి భావనలతో స్వామి వారి సన్నిధిలో జరుపుకునే ఉగాది ఉత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా అన్ని శాఖల అధికారులు ఉత్సవం విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. పండుగ పర్వదినాన భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి స్నానం గదులు, మరుగుదొడ్లు, భక్తులకు అవసరమయ్యే తాగునీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఫైర్, పోలీస్ శాఖ అధికారులు రథోత్సవ సందర్భంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఏవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈవో ధనుంజయ, ఆలయ అనువంశిక ధర్మకర్త కె.సుగుణమ్మ. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు కేంద్రాల పరిశీలన

గుత్తి : ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూతుల ఏర్పాటు కోసం సోమవారం అధికారులు కేంద్రాలను పరిశీలించారు. తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, సిఐ ఎం వెంకటరామిరెడ్డి లు పట్టణంలోని ఏపీ ఆదర్శ పాఠశాల, ఎమ్మెస్ ఉన్నత పాఠశాలలోని గదులను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు చేయనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీవి.రాజకుమార్, పంచాయతీ రాజ్ ఎఇఇ ఎంకె.దివ్య ప్రకాష్, విఆర్ఇ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పెద్దవడుగూరు ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ వీరమ్మ, ఎంపీడీవో కుల్లాయిస్వామి, పంచాయతీరాజ్ ఇంజినీర్ సురేష్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్నీ సిద్ధం చేసేందుకు పోలొంగ్ కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఎప్పటిలాగే ప్రభుత్వం గుర్తించిన భవనంలోనే బూత్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు అనువుగా ఉండే విధంగా తాగునీరు, తదితర సౌకర్యాలు సిద్ధం చేస్తున్నామన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ స్లిప్పులను విఆర్‌ఒల ద్వారా, బిఎల్‌ఒల ద్వారా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు కుళాయిస్వామి, అనిల్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

రైతుల కోసమే పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు

ఉరవకొండ : రైతుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పప్పుశనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విడపనకల్ సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు, సొసైటీ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోలు కేంద్రాలను ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, తహశీల్దారు బ్రహ్మయ్య, మండల వ్యవసాయాధికారి పెన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాల్ రూ.5335 మద్దతు ధరతో రైతులతో కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి పర్వతప్ప, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, సహకార సొసైటీ సిబ్బంది, సర్పంచి జయసింహ, వైసిపి మండల కన్వీనర్ బసన్న, నాయకులు సుంకన్న, దేశాయి సిద్ధార్థ, గిరిబాబు, గోవప్ప, బెస్త ఎర్రిస్వామి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకట్టుకున్న ప్రయోగశాల

ఉరవకొండ : ఉరవకొండ మండలం ఆమిద్యాల ప్రభుత్వ హైస్కూల్లో టాటా పవర్, అగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్ వారు సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ల్యాబ్ ఆన్ బైక్ (బండిపై ప్రయోగశాల) విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించిన అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, టాటా పవర్ సంస్థ సిఎస్ఆర్ రామన్న గౌడ్, సుధాకర్, అగస్త్య ఫౌండేషన్ ఏరియా మేనేజర్ శ్రీధర్, మోహన్, ఐఎంటి ఆనంద్, వీరితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బండిపై ప్రయోగశాలను తిలకిస్తున్న విద్యార్థులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- పెద్దవడుగూరు

పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఓటర్లను కోరారు. సోమవారం మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగస్తుల పట్ల, ప్రజల పట్ల ఎప్పుడూ లేని విధంగా కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమాలను అణిచివేయడం దారుణం అన్నారు. ఉద్యోగులకు న్యాయంగా

గుత్తిలో ఎన్నికల ప్రచారం

రావాల్సిన డిఎలు, పిఆర్‌సిని అమలుచేయాలన్నా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఓటు మాత్రం పోతుల నాగరాజుకు, కత్తి నరసింహారెడ్డిలకు వేయాలని రాంభూపాల్ కోరారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడా ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. పని చేసుకుందామన్నా పనులు దొరకడం లేదన్నారు. నిరుద్యోగ యువత కూడా పోతుల నాగరాజుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఎదుర్కోవాలంటే పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులే సరైన గుణపాఠం చెప్పగలరన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు దస్తగిరి, మద్దిలేటి, కృష్ణనారాయణ, రంగస్వామి, శివ, రాజేష్, క్రిష్టిపాడు పెద్దయ్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి గెలుపు కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. రజాపురం,

పెద్దవడుగూరులో ప్రచారం చేస్తున్న రాంభూపాల్ తదితరులు

మర్నేంపల్లి, పెద్దొడ్డి, అనగానిదొడ్డి, పి.ఎర్రగుడి, మాముడూరు, ఈశ్వరపల్లితోపాటు పలు గ్రామాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, నాయకులు గౌతమ్ నాయక్, కృష్ణ, శివ నాయక్, పెద్దబాబు, సామాజిక కార్యకర్త పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం పుట్లూరు, బాలాపురం, గరుగుచింతలపల్లి తదితర గ్రామాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు బ్యాలెట్ నమూనా పత్రాలను అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సూరి, మండల అధ్యక్షుడు రామాంజి, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, డి.పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రెవెన్యూలో విఆర్‌ఒదే పెత్తనం..

ప్రతి పనికీ ఓ రేటు

ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలం రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒ పెత్తనమే కొనసాగుతోంది. ఐదు నెలలుగా రెగ్యులర్ తహశీల్దారు లేకపోవడంతో ఆయన ఆడిందే ఆట..పాడిందే పాట అన్న చందంగా తయారైంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం 1లో పనిచేస్తున్న విఆర్‌ఒ ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి మండల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరి పేరు మీద ఉన్న భూమి పట్టాను మరొకరి పేరు మీద మార్చడానికి, ఖాతా నెంబర్ 900 వన్ బి అడంగల్ కరెక్షన్ చేయాలన్నా ఒకో రైతు వద్ద నుంచి రూ.40 నుంచి రూ.50 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. దళారులను పెట్టుకొని జీరో-8 కింద ఉన్న భూములను మార్చడానికి వేల రూపాయలను విఆర్‌ఒ వసూలు చేస్తున్నారన్న చర్చ మండలంలో నడుస్తోంది. గతంలో మండల కేంద్రానికి చెందిన శ్రీరామిరెడ్డి కుమారుడు గోపాల్‌రెడ్డి తన తండ్రి పేరు మీద ఉన్న భూమి పట్టాను మరొకరి పేరుమీద మార్చాలని వెళ్తే రూ.50 వేలు డిమాండ్ చేయడంతో దిక్కుతోచని స్థితిలో వెనక్కి వెళ్లారని తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆత్మకూరు విఆర్‌ఒపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్పందన సమస్యలకు పరిష్కారం చూపండి

ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

అర్జీలు పరిశీలిస్తున్న ఎస్‌పి ఫక్కీరప్ప

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

స్పందన కార్యక్రమంలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యలకు చట్టపరంగా పరిష్కారం చూపాలని ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి సిబ్బందిని ఆదేశించారు. అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ ఫక్కీరప్ప 74 పిటీషన్లు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలు తమ బాధలు, సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని పిటీషన్లు అందజేశారు. ప్రతీ పిటీషనర్‌తో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. భూతగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, చిన్న చిన్న రస్తా వివాదాలు, తదితర సమస్యలను విన్నవించారు. చట్టపరిధిలో సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దేవా చారిటబుల్ ట్రస్టు సహకారంతో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల కోసం ఫ్యాక్షన్ హత్యలు వద్దు

నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలి తనకు పగ అంటూ ఉంటే అది జెసి కుటుంబంతోనే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

'రాజకీయాల కోసం తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో ఒక్క రాజకీయ హత్య కూడా జరగకూడదని.. నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని.. తనకు ఏదైనా పగ ఉంటే అది జేసీ కుటుంబంతోనే'..అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర సోమవారం పెద్దపప్పూరు మండలంలోని తురకపల్లి, చిన్నఎక్కలూరు, చాగల్లు గ్రామాల మీదుగా సాగింది. మంత్రి ఉష శ్రీచరణ్ ప్రజా సంక్షేమ యాత్రకు సంఘీభావం తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. చాగల్లు గ్రామంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి సమక్షంలో రఘునాథరెడ్డి మరో 30 కుటుంబాల వారు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ.. అధికారం చేతిలో ఉన్నప్పుడు జెసి కుటుంబం గ్రామాల్లో సమస్యలు సృష్టించి పబ్బం గడుపుకునేదన్నారు. చాగల్లు గ్రామంలో అప్పట్లో ఒక నేత హత్యకు గురయ్యాడని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి ఇక గ్రామంలో ఉండకూడదన్నారు. రాజకీయాల కోసం గ్రామాల్లో రక్తం చిందకూడదన్నారు. పెద్దపప్పూరు మండలంలో రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉందన్నారు. భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రైతులు బంగారు పంటలు పండించి సంతోషంగా జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రమాదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం మెంబర్ వేమనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, ఎంపిపి రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, వాసుదేవరెడ్డి, సూరి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరక్కపల్లె లక్ష్మీరెడ్డి, శివారెడ్డి, చిన్నయక్కలూరు ఓబిరెడ్డి, ముచ్చుకోట అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న మంత్రి ఉష శ్రీచరణ్

వివిధ వేషధారణల్లో చిన్నారులు

ఆకట్టుకున్న గులాబీ ప్రపంచం

సందడిగా సాగిన క్రిసెంట్ కళా సృజన

ప్రజాశక్తి-అనంతపురం

చిన్నారులు అద్భుతమైన సృజన ఉట్టిపడేలా సృష్టించిన గులాబీ ప్రపంచం అందరినీ ఆనందోత్సాహాలలో ముంచెత్తింది. సోమవారం స్థానిక రామ్‌నగర్ లోని క్రిసెంట్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా 'పింక్ వరల్డ్ " పేరిట చిన్నారుల కళా ప్రదర్శనలు సాంస్కృతిక సంబరాలు, విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ కెఎం షఫీవుల్లా, వైస్ ఛైర్మన్ షమీం షఫీవుల్లా నేతృత్వంలో మధ్యాహ్నం చిన్నారుల సృజన నుండి జాలువారిన వివిధ రకాల కళా ప్రదర్శనల ఎగ్జిబిషన్ జరిగింది. గృహోపకరణాలు అందమైన హ్యాంగింగ్స్, ఆకట్టుకునే పుష్పవిన్యాసాలు, వివిధ రకాల గ్రీటింగ్ కార్డ్స్, పూల సజ్జలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కెఎం షఫీవుల్లాతో పాటు ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన ఐద్వా కార్యదర్శి సావిత్రి తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఎగ్జిబిషన్‌ను తిలకించి చిన్నారుల ప్రతిభ పాటవాలను కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన షమీం షఫీవుల్లా మాట్లాడుతూ పిల్లల్లో ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి సంవత్సరం విభిన్న పద్ధతుల్లో కళా ప్రదర్శనలు చిన్నారులచేత చేయిస్తున్నామన్నారు. అంతకుముందు టీచర్ల పాటల పోటీలు, విద్యార్థుల సాంస్కృతిక వేడుకలు ఉత్సాహంగా సాగాయి. సాయంత్రం ఇటీవల టూరిజం ఎక్సెన్సీ అవార్డు అందుకున్న గుంటి మురళీకృష్ణను, వ్యాసమంజూష పుస్తకాన్ని ఆవిష్కరించిన పండిట్ రియాజుద్దీన్ అహమ్మద్‌ను ఘనంగా సత్కరించారు. చిన్నారులందరికీ బహుమతు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగిన చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ సందడిగా జరిగింది.

ఆడపిల్లలను చదివించుకుందాం

ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి ఉరవకొండ

ఆడపిల్లలను చదివించుకోవడంతో పాటు వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విడపనకలు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి పేర్కొన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని విడపనకల్ గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలల్లోనూ రాణించాలన్నారు. తల్లిదండ్రులు వారిని బాగా చదివించాలని, పిల్లల్ని బడి మాన్పించకూడదని తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి జెవి.శ్రీధర్ మాట్లాడుతూ భారతదేశంలో బాలల లింగ నిష్పత్తి జాతీయ జనాభా గణన ప్రకారం 2001లో 1,000 మంది అబ్బాయిలకు 927 మంది బాలికలు ఉన్నారన్నారు. ఇది 2011లో ప్రతి 1,000 మంది అబ్బాయిలకు 918 బాలికల నిష్పత్తి తగ్గిపోయిందన్నారు. కొనసాగితే 1000 మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య 900 కంటే తగ్గుతుందని అంచనా వేశారన్నారు. భ్రూణహత్యలు భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి తగ్గుదలకి దారితీశాయన్నారు. వివిధ కారణాల వల్ల ఆడశిశువుల పట్ల వివక్ష పెరిగి అబార్షన్‌లకు దారితీసిందన్నారు. భ్రూణహత్యలను నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమి రెడ్డి, బాషా, వసుందర, పంచాయతీ సెక్రెటరీలు, పి.ప్రమీలాదేవి, సిహెచ్‌ఒ జి.జయభారతి, మునెమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు షర్మాష్‌వలి, ఆరోగ్య కార్యకర్త శ్రావణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పుష్పావతి భీమ్‌రెడ్డి

బొమ్మనహాల్ : బొమ్మనహాల్, శ్రీధరగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆడపిల్లల సంరక్షణపై వైద్య సిబ్బంది సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలు, మగపిల్లలు ఇద్దరూ సమానమే అన్నారు. లింగనిర్ధారణ, బాల్యవివాహాల నిర్మూలన, ఆడపిల్లల సంరక్షణ తదితర అంశాల గురించి వైద్యులు వివరించారు.

వినాయక ఉత్సవ సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో వినాయక ఉత్సవ సమితి నూతన కార్యవర్గం ఏర్పాటయింది. సోమవారం పట్టణంలోని గోసాబావి వీధి వద్ద ఉన్న బృందావనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పాటయింది. ఈ కమిటీ గౌరవ అధ్యక్షులుగా బీసా శ్రీనివాస్, పోరాలు శివ, ఎన్ కృష్ణ, తాయి శేఖర్, గోపాల్ రెడ్డి, అధ్యక్షులుగా గౌని ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవిరెడ్డిపల్లి రాజేష్, కోశాధికారిగా అరవ నాగభూషణం, సలహాదారుగా సోమ నీలకంఠ ఎన్నుకోబడ్డారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, నాగేష్, హరి, విష్ణు, మధు, పురుషోత్తం, సహాయ కార్యదర్శులుగా గిరీష్, మల్లికార్జున, సోము, నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా వినాయక, కరుణాకర్, రాజేష్, ఆత్మారాం, చంద్రశేఖర్, వేణుగోపాల్ రెడ్డి, మంజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా హర్షిత్ ఎన్నుకోబడ్డారు.

నేరాలు ఘోరాలు

రైళ్లలో చోరీలకు పాల్పడే దొంగ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి-గుంతకల్లు

రైళ్లలోనూ, రైల్వే స్టేషన్లోనూ ఆదమరచి నిద్రపోతున్న ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు, విలువైన సెల్ ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న దొంగను గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. అతని వద్ద నుండి రూ.5.19 లక్షల విలువైన ఆరు బంగారు నగలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. సోమవారం రైల్వే స్టేషన్‌లోని జిఆర్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా, చెన్నేకొత్తపల్లి మండలం, వెంకటాంపల్లి గ్రామానికి చెందిన సాకే ఉదయ్ అనే యువకుడు ఇంటి నుంచి పారిపోయి ధర్మవరంలో భవన నిర్మాణ కూలీగా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడన్నారు. కూలి డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో రైళ్ల లోనూ, రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారంలలో ఆదమరచి ఉన్న ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు, విలువైన సెల్ ఫోన్లకు చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని ఏడు ప్రాంతాలలోని స్టేషన్లలో జరిగిన చోరీలలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు సిఐ బివి.నగేష్ బాబు పర్యవేక్షణలో ఎస్‌ఐలు మహేంద్ర, కె.గోపాల్, రమేష్ గౌడ్, సిబ్బంది దొంగను పట్టుకునేందుకు నిఘావేసి గాలింపు చర్యలు చేపట్టారన్నారు. సోమవారం పక్కా సమాచారంతో గుంతకల్లు రైల్వేస్టేషన్ రైలులో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న నిందితుడు సాకే రమేష్ పారిపోయే ప్రయత్నం చేయగా ఎస్ఐ, సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేశారన్నారు. దీంతో అతను చేసిన చోరీలను ఒప్పుకున్నాడన్నారు. అతని వద్ద ఉన్న చోరీ సొమ్ము స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు.

కలిపోయిన దానిమ్మ మొక్కలను చూపుతున్న రైతు

దానిమ్మ తోట, గడ్డివాములు దగ్ధం

రూ.4 లక్షలు నష్టం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

డి.హీరేహాల్ మండల పరిధిలోని సిద్దాపురం గ్రామానికి చెందిన రైతులు హేమారెడ్డి తిమ్మారెడ్డి, విశ్వనాథ్ లకు చెందిన దానిమ్మ మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. రైతు విశ్వనాథ్‌కు చెందిన దానిమ్మ తోటకు ప్రమాదవశాత్తు నిప్పుపడడంతో దాదాపు రూ.2 లక్షలు వరకు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయారు. దానిమ్మ మొక్కలతోపాటు డ్రిప్ పైపులూ తగలబడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల దిబ్బకు నిప్పు పడడంతో పక్క పొలంలోని వేమారెడ్డికి చెందిన గడ్డివాములు కాలి బూడిద అయ్యాయని తెలిపారు. వేమారెడ్డికి రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఓటును వృథా చేయొద్దు

రాయదుర్గం రూరల్ : జరగనున్న ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని శిక్షకులు సూచించారు. రాయదుర్గం మండల పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన టీచర్లు, సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించారు. ఓటును ఏ విధంగా ఉపయోగించుకోవాలి, సాధారణ ఎన్నికల్లో జరిగే ఓటింగ్ విధానానికి, ఎమ్మెల్సీ ఎన్నికలకు వ్యత్యాసం ఉంటుందని గ్రహించాలన్నారు. ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు (రెండింటికి) ఓటు వేసే హక్కు ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి రఘురాం రావ్, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై ఓటర్లకు, సచివాలయం ఉద్యోగులకు సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్డీవో కె.రవీంద్ర హాజరయ్యారు. మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కెఎండి.ఇస్సాక్ సచివాలయం ఉద్యోగులకు, ఓటర్లకు దృశ్య మాలిక ద్వారా ఓటింగ్ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.రాము, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంపీడీవో జాషువా, ఎంఇఒ కుళ్లాయప్ప, మున్సిపల్ రెవెన్యూ అధికారి నాసిర్ హుస్సేన్, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయ ఓటర్లు, పట్టభద్ర ఓటర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై తహశీల్దారు నారాయణస్వామి అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు ఏ విధంగా వేయాలి, ఓటింగ్ చేసే విధానం, చేసే సాధారణ పొరపాట్లు, ఏ విధంగా ఓటు వేస్తే అది వ్యాలీడ్ అవుతుంది తదితర వాటి గురించి రిసోర్స్ పర్సన్లు జి.లక్ష్మీనరసింహ ఎంఇఒ కృష్ణయ్య, ఎఎస్ఒ క్రిష్ణయ్య వివరించారు.

బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఖాతాదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్న విడపనకల్ కెనరా బ్యాంక్ మేనేజర్ వీరకిశోర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన తీరుకు నిరసనగా ఖాతాదారులు, రైతులు బ్యాంకు ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. బ్యాంకు వద్దకు ఆయా పనుల మీద వచ్చే ఖాతాదారులు, రైతులతో మేనేజర్ వీర కిషోర్ అసభ్యకరంగా, అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారన్నారు. బ్యాంకులో నుంచి బయటకు వెళ్లాలని, ఇది మా బ్యాంకు అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని బాధితులు ఆరోపించారు. క్రాప్ లోన్లు చేయాలంటే రైతులను బెదిరిస్తున్నారన్నారు. బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేస్తేనే లోను ఇస్తాం, లేకపోతే ఇవ్వబోమంటూ ఇబ్బందులకు గురిచేస్తామన్నారు. చాలామంది రైతులు ఫిక్స్డ్ డిపాజిట్ చేసి లోన్లు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రుణం పొంది బకాయిలు చెల్లించకపోతే రుణం పొందిన వారి, జామీన్ వేసిన వ్యక్తుల ఖాతాలను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లాక్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బ్యాంకు మేనేజర్ ప్రవర్తనతో ఖాతాదారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మరోసారి ఇలా జరగకుండా చూడాలని బ్యాంకు మేనేజర్‌కు సూచిస్తూ ఆందోళన చేస్తున్న రైతులను శాంతింపజేశారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు బ్యాంకు మేనేజర్ తీరు మారేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.